మశూచితో జీవాలు జాగ్రత్త!

- నవంబర్ నుంచి ఏప్రిల్ వరకు సోకే ప్రమాదం
- ముందస్తు టీకాలతో దరిచేరని ముప్పు
- జాగ్రత్తలతో తీసుకుంటేనే ఉత్తమం

బెల్లంకొండ: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మేకలు, గొర్రెల పెంపకం దారులు సరైన జాగ్రత్తలు పాటించకపోతే జీవాలకు 'మశూచి వ్యాధి' సోకే ప్రమాదం ఉంది. నిర్లక్ష్యం చేస్తే జీవాలు మత్యవాత పడే అవకాశం ఉందని మండల పశువైద్యాధికారి బాలకృష్ణారెడ్డి చెబుతున్నారు. నవంబర్ నుంచి ఏప్రిల్ వరకు జీవాలకు మశూచి వ్యాధి (ఫాక్స్ వైరస్) వచ్చే ప్రమాదం ఉందన్నారు. గాలి ద్వారా వచ్చే ఈ వైరస్ వ్యాధితో గొర్రెలు, మేకలు ఆహారం తీసుకోకపోవడంతో పాటు, శ్వాస ఆడక ప్రాణాలు కోల్పోతాయన్నారు.

వైరస్ వల్లే వ్యాధి వ్యాపిస్తుంది

మశూచి వైరస్ గాలి ద్వారా సంక్రమిస్తుంది. దాణా తొట్టిలు, నీటి తొట్టిలు, ఇతర వస్తువుల ద్వారా ఇది వ్యాప్తి చెందుతుంది. గాలి ద్వారా వైరస్ ఊపిరితిత్తుల్లోకి చేరి ఇతర జీవాలకు కూడా ఇది వ్యాపిస్తుంది.

పొలాల్లో జీవాల మంద

నియోజకవర్గ వ్యాప్తంగా జీవాల వివరాలు

నియోజకవర్గంలో ఐదు మండలాల వ్యాప్తంగా పశు సంవర్ధక శాఖ లెక్కల ప్రకారం మొత్తం 1,08,846 జీవాలున్నాయి. వాటిలో 76,827 గొర్రెలు ఉండగా, 32,019 మేకలు ఉన్నాయి.

మండలం	గొర్రెలు	మేకలు
బెల్లంకొండ	14,967	12,493
క్రోసూరు	13,860	2,907
అచ్చంపేట	34,932	11,894
అమరావతి	10,396	3,445
పెదకూరపాడు	2,672	1,280

వ్యాధి లక్షణాలు

మేకలు, గొర్రెలలో వ్యాధి సోకిన వారం రోజుల్లో లక్షణాలు బయట పడతాయి. జీవాలకు జ్వరం తీవ్రంగా ఉంటుంది. చర్మంపై వెంట్రుకలు లేని భాగం, తోక కింద, పెదవులు, ముక్కు రంధ్రాలు, జననేంద్రియాలు, పాల పొదుగులపై ఎర్రటి దద్దుర్లు, పొక్కుల ఏర్పడతాయి. కళ్ల నుంచి నీరు, నోటి నుంచి చొంగ, ముక్కు నుంచి చీముడు కారుతుంది. మశూచి వలన శ్వాస కోశ వ్యాధి వస్తే గొర్రెలు శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. జీర్ణకోశ వ్యవస్థ దెబ్బతింటే రక్త విరేచనాలు అవుతాయి.

నివారణ చర్యలు

ప్రతి సంవత్సరం నవంబర్‌లో జీవాలకు మశూచి నివారణ వ్యాక్సిన్‌లు వేయించాలి. కొత్త జీవాలను మందలో చేర్చే ముందు వాటిని కొన్ని రోజులు మందకు దూరంగా ఉంచాలి. వాటి ఆరోగ్యాన్ని పరీక్షించాలి. అన్నీ ఆరోగ్యంగా ఉంటేనే మందలో కలపాలి. వ్యాధి సోకిన మందల చెంతకు వ్యాధి సోకని జీవాలను వెళ్లనివ్వకూడదు. వ్యాధి లక్షణాలు కనబడితే వెంటనే స్థానిక పశువైద్యాధికారి సంప్రదించాలి. వ్యాధి సోకిన జీవాలను వెంటనే మంద నుండీ వేరు చేయాలి. తేలికగా జీర్ణం అయ్యే ఆహారాన్ని అందించాలి. వ్యాధి వలన చనిపోయిన గొర్రెలను లోతుగా గొయ్యి తీసి ఖననం చేయాలి. జీవాలు చనిపోయిన ప్రదేశం, అవి తాగిన నీరు, తిన్న దాణా తొట్టిలను క్రిమి సంహారక ద్రావకంతో శుభ్రం చేయాలి.

నేటి నుంచి పశుగణన సర్వే

క్రోసూరు: రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం నుంచి ఫిబ్రవరి 28 వరకు మండలంలో అన్ని గ్రామాల్లో పశుగణన కార్యక్రమం జరుగుతుందని మండల పశు వైద్యులు డాక్టర్ మల్లయ్య తెలిపారు. శుక్రవారం నుంచి చేపట్టాల్సిన సర్వే వాయిదా పడినట్లు చెప్పారు. అందుకని శనివారం నుంచి సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పశుగణన కోసం ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లుగా మండల సచివాలయ సిబ్బంది, వైద్యులు ఇంటింటికీ వెళ్లి పశువుల వివరాలు నమోదు చేసుకుంటారని చెప్పారు. తద్వారా పశుగణన రంగ పథకాల రూపకల్పనకు అవకాశం ఉంటుందన్నారు.

డీటీకి తహసీల్దారు బాధ్యతలు

క్రోసూరు: డిప్యూటీ తహసీల్దార్ జింకా శ్రీనివాసరావుకు తహసీల్దార్‌గా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈయన గుంటూరు పశ్చిమ మండల రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ గతవారం బదిలీపై స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. సాధారణ బదిల్లో భాగంగా తహసీల్దార్‌ను వేసినప్పటికీ ఇక్కడ ఇంకా బాధ్యతలు తీసుకోలేదు. దీంతో తహసీల్దార్ వచ్చే వరకు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావుకు ఎఫ్ఏసీ ఇచ్చినట్లు తెలిపారు.

క్లుప్తంగా

టీటీడీ కల్యాణ మండపం నిర్మాణ పనులు ప్రారంభం

పెదకూరపాడు: మండలంలోని 75 తాళ్లూరు గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం, స్థానిక దాతల సహకారంతో సమకూర్చిన రూ. 2.40 కోట్ల నిధులతో పాత సమితి స్థలంలో కల్యాణ మండపం నిర్మాణ పనులను జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి అర్తిమల్ల రమేష్ కూటమి నేతలతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. త్వరితగతిన నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆలయ నిర్మాణ కమిటీకి సూచించారు. క్రోసూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బెల్లంకొండ రామ్ గోపాల్‌రావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, మాజీ ఎంపీపీ గల్లా బాబురావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మక్కెన సాగర్, 75 తాళ్లూరు తెలుగుదేశం పార్టీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పత్తి పంటలో కోత ప్రయోగం

రాజుపాలెం: మండలంలోని దేవరంపాడు గ్రామంలో పత్తిపంటలో పంటకోత ప్రయోగం మండల వ్యవసాయాధికారి పి.వెంకట నర్సయ్య శుక్రవారం నిర్వహించారు. అడకా వెంకటేశ్వర్లు రైతు పొలంలో పత్తిపంట దిగుబడిని అంచనాలతో నిర్వహించారు. 100 చ. మీటర్ల విస్తరణలో మొదట విడత పత్తి తీసి తూకం వేయగా 6.07 కేజీల దిగుబడి వచ్చినట్లు గుర్తించారు. దీని ప్రకారం ఎకరాకు 2.5 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ముస్తాక్, భవాని, రైతులు పాల్గొన్నారు.

క్రికెట్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): పట్టణంలోని శ్రీ శరభయ్య హైస్కూల్ గ్రౌండ్‌లో భాష్యం స్కూల్స్ ఆధ్వర్యంలో క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పోటీలను పట్టణ ఎస్సై సంధ్యారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆమె మాట్లాడారు. పోటీలలో గెలుపు, ఓటములు సమానంగా తీసుకోవాలని చెప్పారు. చిన్నప్పటి నుంచే పోటీ తత్వం అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐను పాఠశాల సిబ్బంది అభినందించింది. ఏఎస్సై సుబ్బారావు, భాష్యం ప్రిన్సిపల్ సుందరరావు, పీఈటీ రాజేష్, కిరణ్, అజయ్ పాల్గొన్నారు.

వృత్తి విద్యలోనూ నైపుణ్యం సాధించాలి

అచ్చంపేట: వృత్తి విద్యలో నైపుణ్యం సాధించాలని, భవిష్యత్తులో ఉపయోగపడతాయని స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలురు గురుకుల పాఠశాల/కళాశాల ఒకేషనల్ ఉపాధ్యాయుడు కట్టా శివన్నారాయణ తెలిపారు. పాఠశాలలోని 10వ తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులు వృత్తి విద్యలో భాగంగా శుక్రవారం స్థానిక స్టేట్ బ్యాంక్ ఇండియా బ్రాంచ్‌ను సందర్శించారు. బ్యాంకుల ద్వారా వినియోగదారులకు అందజేస్తున్న సేవలు, డిజిటల్ సేవల పట్ల ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి మేనేజరు జయ భారతి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ టి.అరుణ్‌కుమార్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

టైరు పంక్చరై... కారు ధ్వంసం

నాదెండ్ల: జాతీయ రహదారిపై కారు టైరు పంక్చర్ కావడంతో వెనుక వస్తున్న కంటెయినర్ ఢీకొంది. స్థానికుల వివరాల మేరకు.. నెల్లూరు నుంచి విజయవాడ వెళ్తున్న కారు గణపవరం వద్దకు రాగానే టైరు పంక్చరైంది. అదుపుతప్పి డివైడర్ వైపునకు రావటంతో వెనుక నుంచి చెన్నై నుంచి విజయవాడ వెళ్తున్న మెడిసిన్ లోడు లారీ ఢీకొంది. దీంతో కారు రోడ్డుకు అడ్డుగా తిరిగి ధ్వంసమైంది. ఎస్సై పుల్లారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఎమ్మార్పీకి అధికంగా విక్రయిస్తే చర్యలు

అచ్చంపేట: ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడీఏ) హనుమంతరావు ఎరువుల దుకాణ దారులు, డీలర్లను హెచ్చరించారు. అచ్చంపేటలో శుక్రవారం ఆయన ఎరుకుల దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. గొడౌన్‌లో ఉన్న స్టాక్, రిజిష్టర్లలో నమోదు చేసిన నిల్వలను సరిచూశారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే లైసెన్సులు రద్దు చేయడమే కాకుండా, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి షాపులో స్టాక్ బోర్డులను ఏర్పాటు చేసి ప్రతి రోజు స్టాక్ డిస్‌ప్లే చేయాలని, ధరలను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించాలని చెప్పారు. ఎరువులు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. ప్రతి విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని, తేడాలను సహించేది లేదన్నారు. ఆయన వెంట ఏవో వెంకటేశ్వర్లు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అచ్చంపేటలో ఎరువుల గొడౌన్‌ను తనిఖీ చేస్తున్న ఏడీఏ హనుమంతరావు

ఇంకుడు గుంతలకు దరఖాస్తుల ఆహ్వానం

క్రోసూరు: ఇళ్ల వద్ద ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకునేందుకు గ్రామ పంచాయతీల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో బి.మహేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునే వారికి ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు రూ.5 వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేందుకు సోమవారం లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): పట్టణంలోని 31 వార్డుల్లో ప్రతి రోజు సరఫరా చేస్తున్న రక్షిత మంచినీటిని కాచి వడపోసి తాగాలని సత్తెనపల్లి పురపాలక సంఘం కమిషనరు కె.షమ్మి శుక్రవారం తెలిపారు. మంచినీరు ఎక్కడైనా అనివార్య కారణాల వల్ల కొళాయిల ద్వారా కలుషితమై వస్తే.. పురపాలక సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు. పట్టణ ప్రజలు తాగు నీటి విషయంలో అశ్రద్ధ చేయకుండా జాగ్రత్తగా ఉండాలని కోరారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే కన్నా

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, శుక్రవారం కలిశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో చర్చ జరిగినట్లు టీడీపీ నాయకులు చెప్పారు. కూటమి బలపరిచిన అభ్యర్థికి మద్దతుగా పనిచేయాలని సూచించినట్లు సమాచారం. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ముప్పాళ్ళ మాజీ ఎంపీపీ గోగినేని కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు యెలినేడి రామస్వామి, నాగోతు శౌరయ్య, పూజల వెంకటకోటయ్య, చౌటా శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

సీఎంకు నేతలను పరిచయం చేస్తున్న ఎమ్మెల్యే..

పారదర్శకంగా పశుగణన

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): గ్రామాల్లో పశుగణన పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డా.రామారావు అన్నారు. మండలంలోని గుడిపూడి, నందిగామ గ్రామాల్లో జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్రంలో పశుగణన జరుగుతోందని, అధికారులతో పాటు రైతులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా గణన కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. పశుగణన పూర్తి అయితే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని రకాల పశువులకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడం సులభమవుతుందన్నారు. రైతులు, పశుపోషకులు వర్షాకాలంలో తమ పశువులను, జీవాలను ఇతర రకాల జంతువులను నిశితంగా గమనించాలని, వాటిలో ఆరోగ్య రీత్యా ఏమైనా మార్పులు సంభవిస్తే దగ్గరలోని పశు సంరక్షణ కేంద్రాలలోని వైద్యులను సంప్రదించాలన్నారు. పశుగణన వేగవంతం చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి సహాయ సంచాలకులు డా.శ్రీనివాసరావు, పెదమక్కెన పశు వైద్యాధికారి శిరీష తదితరులు పాల్గొన్నారు.

గుడిపూడిలో నట్టల నివారణ మందును అందిస్తున్న రామరావు

పోలీసు విధులపై విద్యార్థులకు అవగాహన

నకరికల్లు: అమర వీరులను స్ఫూర్తిగా తీసుకొని వృత్తిలో ధైర్య సాహసాలతో పనిచేయాలని ఎస్‌ఐ చల్లా సురేష్ సిబ్బందికి సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అమరవీరుల వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. అమరవీరులకు నివాళులు అర్పించారు. విద్యార్థులకు స్టేషన్‌లో పోలీస్ పనితీరు, ఆయుధాలు, పరికరాలు, వాటిని వాడే విధానంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు అడిగే ప్రశ్నలకు సమాధానమిచ్చారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్, సాంకేతిక నేరాలు నివారించడంతో యువత పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.నగేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుధాల పనితీరును వివరిస్తున్న ఎస్‌ఐ చల్లా సురేష్

108 మందికి ఆధార్ సేవలు

నకరికల్లు: స్థానిక సచివాలయంలో మూడురోజుల పాటు నిర్వహించిన ఆధార్ నవీకరణ శిబిరాన్ని 108 మంది సద్వినియోగం చేసుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి కేవీ శివప్రసాద్ తెలిపారు. ఆధార్ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా అడ్రస్ మార్పు, పేర్లలో తప్పులు సరిచేయడం, ఫోన్ నంబర్, జనన ధృవీకరణ పత్రం ఆధారంగా మార్పులను డెమోగ్రాఫిక్ పద్ధతిలో చేశామన్నారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ శాంతి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నరసరావుపేట: పోలీస్ అమరవీరుల స్మారకోత్సవాలలో భాగంగా జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు శుక్రవారం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు పాఠశాలలు, కళాశాలలో విద్యార్థిని విద్యార్థులు, పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సైబర్ క్రైమ్ నేరాలు-నియంత్రణలో యువత పాత్ర, ప్రస్తుత సమాజంలో పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశాలపై నిర్వహించిన ఈ పోటీలకు విద్యార్థులు, పోలీసు సిబ్బంది ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థిని, విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికితీయటంతో పాటు పోలీస్ శాఖపై పూర్తిస్థాయిలో అవగాహన, మంచి దృక్పథం, స్ఫూర్తి కల్పించే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ప్రస్తుత సమాజంలో సైబర్ క్రైమ్ నేరాలు జరుగుతున్న తరుణంలో వాటిని నియంత్రించేందుకు యువత అప్రమత్తంగా ఉండి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా తన జీవితాలు కాపాడుకోవాలని, సమాజ శ్రేయస్సు, భద్రతల కోసం పోలీసులు అందిస్తున్న సేవలు, త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసుల సేవలు, దైనందిన విధులు, త్యాగాలు పట్ల అవగాహన చేసుకోవడం, గుర్తించడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు.

వ్యాస రచనలో పాల్గొన్న విద్యార్థులు

హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయండి

- అక్రమ రాజకీయ తొలగింపులపై హైకోర్టు ఇచ్చిన ఆర్డర్ ను అమలు చేయాలి: సీఐటీయూ
- వెలుగు కార్యాలయం ఎదుట వీఓఏల ధర్నా

క్రోసూరు: వెలుగులో పనిచేస్తున్న వీవోఏల(విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్) అక్రమ రాజకీయ తొలగింపులపై హైకోర్టు ఆర్డర్ ను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.రవిబాబు కోరారు. శుక్రవారం మండలంలో అక్రమ రాజకీయ తొలగింపులకు గురైన వీవోఏలు హైకోర్టును సంప్రదించారు. హైకోర్టు ఆర్డర్ కాపీలను మండల అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ కృపావేణికి అందజేయడానికి వెళ్లినట్లు చెప్పారు. దీనిపై ఏపీఏ కృపావేణి మాట్లాడుతూ వీవోఏ లను నియమించుకోవడం, తొలగించడం చేయాల్సింది గ్రామ సంఘాలని, తమకు సంబంధం లేదని హైకోర్టు ఆర్డర్ కాపీలను తీసుకోకుండా నిరాకరించారని తెలిపారు. దీంతో సీఐటీయూ ఆధ్వర్యంలో తొలగించబడిన వీవోఏలు మండల వెలుగు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ హైకోర్టు ఇచ్చిన ఆర్డర్‌ను బాధ్యత కలిగిన ఏపీఎం కనీసం తీసుకోపోవడం అన్యాయమన్నారు. వీవోఏలను ఏ గ్రామ సంఘం ఆపమని చెప్పిందో తెలపాలని ప్రశ్నించారు. కేవలం రాజకీయ నాయకుల ఒత్తిడితోనే ఈ అక్రమ తొలగింపులు జరిగాయన్నారు. ప్రభుత్వాలు మారిన ప్రతి సందర్భంలో చిరుద్యోగుల జీవితాలతో రాజకీయ నాయకులు ఆడుకోవడం దుర్మార్గమని అన్నారు. అధికారులు హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని లేకుంటే తీవ్రమైన ఆందోళనలు , పోరాటాలు చేయాల్సి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తొలగింపుకు గురైన వీవోఏలు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న తొలగింపునకు గురైన వీవోఏలు

ఆర్ఎస్‌కే సిబ్బందికి నైపుణ్య పెంపుదలపై శిక్షణ

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ సబ్ డివిజన్ రైతు సేవా కేంద్రం సిబ్బందికి నైపుణ్య పెంపుదలపై శిక్షణా కార్యక్రమం పట్టణంలోని మార్కెట్ యార్డులో నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా శిక్షణా కోఆర్డినేటర్ ఎం. శివకుమారి మాట్లాడుతూ వరిలో చీడపీడల యాజమాన్యం గురించి వివరిస్తూ మన ప్రాంతంలో ఆకుముడత, దోమ పోటు ఆశించే అవకాశం ఉందని, ఆర్థిక నష్ట పరిమితి స్థాయిని బట్టి దోమ నివారణకు డైనోటేఫ్యూరాన్ లేదా బూప్రొఫెజిన్ లేదా ట్రిఫ్లూమెజోఫైరిన్ వాడాలన్నారు. ఆకుముడత నివారణకు కార్టాప్ హైడ్రో క్లోరైడ్ వాడాలన్నారు. రబీ మొక్కజొన్నలో సమగ్ర పోషక యాజమాన్యంలో భాగంగా జీవన ఎరువులు, 100 కిలోల నత్రజని, 35 కిలోల భాస్వరం, 35 కిలోల పొటాష్ వాడాలని తెలిపారు. వివిధ పంటలలో వాడాల్సిన జీవన ఎరువుల గురించి తెలిపారు. ఉద్యాన శాఖాధికారి రసూల్ మాట్లాడుతూ మిరపలో యాజమాన్య పద్ధతులు , ఉద్యాన శాఖలో అమలవుతున్న పథకాల గురించి వివరించారు. వినుకొండ, ఈపూరు, బొల్లాపల్లి, నూజెండ్ల మండల వ్యవసాయ శాఖ అధికారులు పంటల బీమా, వ్యవసాయ శాఖలో ఇతర పథకాల గురించి అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శివకుమారి

చకచకా స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటు

శావల్యాపురం: ప్రీపెయిడ్ స్మార్ట్ విద్యుత్ మీటర్ల కేటగిరి-2 వ్యాపార సముదాయాల్లో అమర్చే పనులు జరుగుతున్నట్లు మండల విద్యుత్‌శాఖాధికారి జవ్వాజీ నటరాజ్ తెలిపారు. శుక్రవారం స్థానిక విద్యుత్ ఉప కేంద్రంలో ఏఈ నటరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాలు మేరకు తొలివిడతలో ప్రభుత్వ కార్యాలయాలు, వీధిలైట్లు, కేటగిరి-2లో ఏర్పాటు చేసిన విద్యుత్ మీటర్ల స్థానంలో నూతన ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు 525 స్మార్ట్ మీటర్ల మంజూరు కాగా శావల్యాపురంలో 212 మీటర్ల అమర్చే పనులు జరుగుతున్నాయన్నారు. ఆధునికీకరణ సాంకేతిక పరిజ్ఞానంతో స్మార్ట్ మీటర్ల తయారు చేసినట్లు తెలిపారు. రీచార్జ్ చేసుకుంటేనే విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. గృహాలకు కూడా స్మార్ట్ విద్యుత్ మీటర్ల అమర్చే పనులు నూరుశాతం పూర్తి కాగానే ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు నూతన విధానం అమల్లోకి వస్తుందన్నారు. అప్పటి వరకు బిల్లు విధానం అమలులో ఉంటుందన్నారు.

ఓటు నమోదు చేసుకోండి

నరసరావుపేట: కృష్ణా-గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమం నవంబర్ ఆరవ తేదీ వరకు మాత్రమే గడువు ఉన్నందున పట్టణ, గ్రామాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు తమ ఓటును చేర్చుకొని పార్టీకి అండగా నిలివాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలు అందరు ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఉధృతంగా చేపట్టాలని, గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ప్రతిరోజు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. వచ్చే ఆదివారం ఈ కార్యక్రమం పార్టీ కార్యాలయంలో పెద్దఎత్తున చేపట్టనున్నామన్నారు.

ఆటోమొబైల్ రంగంలో వ్యాపార, ఉపాధి అవకాశాలు

నరసరావుపేట రూరల్: ఆటోమొబైల్ రంగంలో వ్యాపార, ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని షియాగో సర్వీస్ హెడ్ బైరెడ్డి శివప్రసాదరెడ్డి తెలిపారు. జేఎన్‌టీయూఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానిక్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఆటోమొబైల్ వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్‌షాప్‌కు షియాగో సర్వీస్ ఏపీ, తెలంగాణ హెడ్ శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథిగాహాజరై ప్రసంగించారు. ఆటోమొబైల్ రంగంలో ఎలా స్థిరపడాలో విద్యార్థులకు తెలియజేశారు. ఆటోమోటివ్ పరిశ్రమలో మోటర్ వాహనాల రూపకల్పన, అభివృద్ధి, తయారీ, మార్కెటింగ్, విక్రయాలు, మరమ్మతులు వంటి అనేక రకాల కంపెనీలు, సంస్థలు ఉన్నాయని వివరించారు. ఆదాయ మార్గాల్లో ప్రపంచంలోనే అతిపెద్ద పరిశ్రమ ఆటోమోటివ్ అని తెలిపారు. మెకానికల్ అండ్ ఆటోమొబైల్ చదువుతున్న విద్యార్థులకు ఎన్నో ఉద్యోగావకాశాలు ఉన్నాయని తెలిపారు. జీవితంలో చదువు ద్వారానే అన్ని నేర్చుకోలేరని, ప్రాక్టికల్‌గా సమాజం నుంచి కొంత నేర్చుకోవడం ద్వారా జీవితంలో రాణించవచ్చని సూచించారు. కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ ఐఎస్ ఫణిసుష్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌కు హాజరైన బైరెడ్డి శివ ప్రసాదరెడ్డి

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

నరసరావుపేట: పట్టణానికి చెందిన నక్కథామస్ అనే దళితుడికి ప్రభుత్వం ఇచ్చిన మూడు సెంట్ల స్థలాన్ని ఆక్రమించాలని చూస్తున్న మెడికల్ వ్యాపారులు బీవీ సత్యనారాయణ, కె.నాగరాధిక, వారికి సర్వే రిపోర్ట్ ఇచ్చిన మున్సిపల్ టౌన్ సర్వేయర్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసిన అనంతరం కమిషనర్ ఎం.జస్వంతరావుకు వినతిపత్రం అందజేశారు. పీడీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, పౌర హక్కుల సంఘం జిల్లా నాయకులు శిఖనం చిన్న, సీఐటీయూ నాయకులు షేక్ సిలార్, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కమిషనర్ జస్వంతరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, బాధితులు